'అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, మే 18: కామారెడ్డి పట్టణంలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ అన్నారు. శనివారం డీఈవో రాజును కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తూ అనుమతిలేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కామారెడ్డిలో ఎలాంటి అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్‌లను నిర్వహిస్తున్న ప్రణతి కోచింగ్ సెంటర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.



రుణమాఫీపై ఆశలు

- ఆగస్టు 15లోగా మాఫీ చేస్తానని ప్రకటించిన సీఎం
- రుణమాఫీ కోసం ప్రత్యేక కార్పొరేషన్
- బ్యాంకర్లను వివరాలను కోరిన ప్రభుత్వం
- గత ఏడాది డిసెంబరు 7 వరకు కటాఫ్
- జిల్లాలో సుమారు 3 లక్షల మందికి పైగా రైతులకు లబ్ధి

కామారెడ్డి, మే 18(ఆంధ్రజ్యోతి):

ఎన్నికల మేనిఫేస్టోలో ఇచ్చిన హామీ మేరకు రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 15లోగా ఖచ్చితంగా రూ.2లక్షల లోపు పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం పాలనపై దృష్టి సారించింది. రుణమాఫీనే ఎజెండాగా శనివారం క్యాబినెట్ సమావేశం సైతం నిర్వహించారు. రుణమాఫీకై ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సైతం అధికార వర్గాలతో సమావేశమై సాధ్యాసాధ్యాలపై చర్చించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ సారైనా ప్రభుత్వం రుణమాఫీ చేయాలని రైతుల నుంచి డిమాండ్ వస్తోంది.

పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకి

గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ రైతులందరికి రూ.2లక్షల లోపు పంట రుణాలు ఉన్న మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో చాలా వరకు రైతులు పంట రుణాలు బ్యాంక్‌లకు చెల్లించలేదు. కొందరు రుణాలు రెన్యూవల్ చేసుకున్నప్పటికీ అనేక మంది రైతులు రెన్యూవల్ చేయించుకోని పరిస్థితి దీంతో బ్యాంకర్లు యాసంగి సీజన్‌లో రైతులకు పంట రుణాలు అందించలేదు. రైతులు విధిలేని పరిస్థితుల్లో పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల్లో ఒకటైన రుణమాఫీని కూడా చేస్తామని హామీ ఇచ్చారు. కానీ వివిధ కారణాలతో పాటు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పంట రుణాల మాఫీకి అడ్డంకిగా మారింది. తాజాగా ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో రుణమాఫీపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

బ్యాంకర్లను వివరాలు కోరిన ప్రభుత్వం

రూ.2లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను పంపించాలని బ్యాంక్‌లను ప్రభుత్వం కోరినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన గత ఏడాది డిసెంబరు 7వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించి అప్పటిలోగా రూ.2లక్షల రుణాలు తీసుకున్న రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. ఒక్కో రైతుకు ఎన్ని లక్షల పంట రుణాలు ఉన్నప్పటికీ కేవలం రూ.2లక్షల లోపు వరకు మాత్రమే మాఫీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ ప్రతినిధులు జిల్లా స్థాయిలోని బ్యాంకర్లకు నివేదికలను ఈ నెలాఖరులోగా అందించాలని కోరారు.

సుమారు 3లక్షలకు పైగా మంది రైతులకు లబ్ధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా మాఫీ చేయని రుణాలతో పాటుగా ఇప్పటి వరకు సుమారు 3 లక్షల మందికి పైగా రైతులు వివిధ బ్యాంకులకు పంట రుణాలను చెల్లించాల్సి ఉంది. సుమారు రూ.4500కోట్ల మేర పంట రుణాలు బాకీ పడినట్లు సంబంధిత శాఖధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో సుమారు 3లక్షల వరకు రైతుల రుణమాఫీ పొందే అవకాశం ఉంది. ఈ రుణాలను ప్రభుత్వమే టెకోవర్ చేసుకుని పంట రుణాలకు విడుతల వారీగా బ్యాంక్‌లకు ప్రభుత్వమే చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి

వారం రోజుల్లో మొత్తం ధాన్యాన్ని కొంటాం

- డీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి

బీబీపేట, మే 18: మండలంలోని సొసైటీ పరిధిలోని మొత్తం ధాన్యాన్ని వారం రోజుల్లో పూర్తిగా కొనడం జరుగుతుందని డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లాల చైర్మన్ ఎదుల్లా ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీబీపేట మండల పరిధిలో వరి పంట వేయడం కొంత ఆలస్యంగా ఉంటుందని తద్వారా పంటచేతికి వచ్చే సమయం కూడా ఆలస్యం ఉంటుందని అన్నారు. గత నెల 22 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని దాదాపు 25 రోజుల కాల వ్యవధిలో బీబీపేట సొసైటీ పరిధిలో 2,31,300 బస్తాలను రైస్‌మిల్లులను పంపించామని ఇంకా దాదాపు 1,50,000 బస్తాలు కల్లాల్లో ఉన్నాయని 7 నుంచి 8 రోజుల్లో పూర్తి ధాన్యాన్ని తరలిస్తామని అన్నారు. అకాల వర్షాల రైస్‌మిల్లర్లు సహకరించకపోవడం లారీల కొరత వంటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని కలిస్తే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారని అన్నారు. ధాన్యాన్ని సిద్దిపేట, హన్మకొండ, నిజామాబాద్ జిల్లాలకు తరలించాడాన్ని షబ్బీర్‌అలీ చొరవ తీసుకున్నారని అన్నారు. ఇది రైతు ప్రభుత్వమని రైతుల కోసం నిరంతరం పాటుపడుతుందన్నారు. కానీ కొందరూ వ్యక్తులు కావాలని బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రైతుల బాధలను రాజకీయం చేయవద్దని డైరెక్టర్ మల్లేషం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కిషన్‌రావు, సిద్ధరాములు, సత్తయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

లింగంపేట, మే 18: మండలంలో ఖరీఫ్‌కు జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. భూసారాన్ని పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. లింగంపేట, నల్లమడుగు సొసైటీల్లో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలియ జేశారు. లింగంపేట సొసైటీలో 666 బస్తాలు, నల్లమడుగు సొసైటీలో 166 బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తాను 60 శాతం సబ్సిడీపై రూ.1116లకు విక్రయిస్తున్నామని విత్తనాలు అవసరమైన రైతులు పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డులను జిరాక్స్ ఇచ్చి విత్తనాలు తీసుకువెళ్లాలని ఆయన సూచించారు.



ఎల్లారెడ్డిలో అవిశ్వాసానికి హాజరైన కౌన్సిలర్లు

ఎల్లారెడ్డి మున్సిపల్

చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- చైర్మన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తిన 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం చైర్మన్‌కు వ్యతిరేకంగా మద్దతు

ఎల్లారెడ్డి, మే 18: జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణపై శనివారం నిర్వహించిన అవిశ్వాసం నెగ్గింది. మొత్తం 12 మంది కౌన్సిలర్లలో బీఆర్ఎస్‌కు చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు, అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సైతం చైర్మన్‌కు వ్యతిరేకంగా చేతులెత్తారు. అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ తన పదవిని కోల్పోయారు. కాగా.. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. రాష్ట్రంలో అవిశ్వాసం పెట్టిన మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ గిరీలను నెగ్గింది. కానీ ఎల్లారెడ్డిలో మాత్రం బీఆర్ఎస్ పార్టీ అవిశ్వాసంలో నెగ్గడంతో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగలగా.. బీఆర్ఎస్ మాత్రం పట్టు నిలుపుకుంది. మున్సిపల్ చైర్మన్ పనితీరుపై అసంతృప్తితో ఉన్న ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు సైతం చైర్మన్‌కు వ్యతిరేకంగా మద్దతు ఇచ్చారు. ఈ అవిశ్వాస ప్రక్రియలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



కంపోస్టుషెడ్‌లను పరిశీలిస్తున్న డీపీవో

విధులను సక్రమంగా నిర్వహించని

అధికారులపై చర్యలు తప్పవు

రామారెడ్డి, మే 18: విధులు సక్రమంగా నిర్వహించని అధికారులపై చర్యలు తప్పవని కామారెడ్డి డీపీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డిపేట, జగదాంబతండా కంపోస్టుషెడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని చెత్తను కంపోస్టుషెడ్‌లకు తరలించాలని తెలిపారు. నర్సరీలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో సవిత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా అమరేష్ కళ్యాణి

కామారెడ్డి టౌన్, మే 18: కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌గా అమరేష్ కళ్యాణి నియామకం అయ్యారు. గతంలో ఇక్కడ పని చేసిన సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడంతో ఆయనను బాధ్యతల నుంచి తప్పించారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కామారెడ్డి టౌన్, మే 18: ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ పరీక్షలకు 1,0511 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఇందుకోసం 29 పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కామారెడ్డి, బాన్సువాడలలో పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలని రెవెన్యూ అధికారులను, ప్రతీ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం, శ్రీనాథ్, నాగేశ్వరయ్య, డీఈవో రాజు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జూన్ 9న నిర్వహించే గ్రూప్ 1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి జిల్లా కలెక్టర్‌లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో సంబంధిత అభ్యర్థులకు సరిపడ అవసరమైన మేర వసతులు కల్పించాలని, ఫర్నిచర్ టాయిలెట్స్, తాగు నీరు, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని అన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లోకి 9 గంటల నుంచే అనుమతి ఉంటుందని తెలిపారు. 10 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4,972 మంది అభ్యర్థుల కోసం 12 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

అకాల వర్షాల వల్ల రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి

అకాల వర్షాలు పడుతున్నందున తహసీల్దార్‌లు, ఆర్‌డీవోలు కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని త్వరితగతిన ధాన్యం మిల్లులకు తరలించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. కోమలంచ, నిజాంసాగర్, మహ్మద్‌నగర్, లింగంపేట తదితర ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయని తెలిపారు. తహసీల్దార్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో ప్రతిరోజూ చర్చిస్తూ లారీలు ఏర్పాటు చేసి మిల్లులకు ధాన్యం తరలించాలని తెలిపారు. ఈ విషయంలో రైతులకు పూర్తి సహకారం అందించాలని, వారికి మనోధైర్యం కల్పించాలని సూచించారు. సహకార సంఘాల అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద కావాల్సిన టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం తడవకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఆర్‌డీఓలు, తహసీల్దార్‌లు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు.

దోమకొండకు వంద పడకల ఆసుపత్రి మంజూరయ్యేనా?



దోమకొండ సీహెచ్‌సీ

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రం రాసిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ
- సీహెచ్‌సీలో రోజుకు వందల్లో ఓపీ
- దోమకొండలో 100 పడకల ఆసుపత్రి మంజూరైతే 4 మండలాల ప్రజలకు తొలగనున్న ఇబ్బందులు

దోమకొండ, మే 18: దోమకొండ మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి మంజూరుకు ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. 100 పడకల ఆసుపత్రి దోమకొండకు ప్రభుత్వం మంజూరు చేస్తే చుట్టు పక్కల ఉన్నటువంటి మాచారెడ్డి, పల్వంచ, భిక్కనూర్, బీబీపేట మండలాల ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

సీఎంకు లెటర్ రాసిన ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ

దోమకొండ గతంలోనే పాత తాలూకాగా కొనసాగిందని ప్రస్తుతం ఉన్నటు వంటి కమ్యూనిటి హెల్త్ సెంటర్ (30 పడకల ఆసుపత్రిలో ప్రతి రోజూ వందల్లో రోగులు వస్తున్నారు. అందులో చాలా మంది రోగులు ఇన్ పేషెంట్‌లుగా చేరుతున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మంగళవారం ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లెటర్ రాశారు. దోమకొండలో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేస్తే ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, బీబీపేట నుంచి కామారెడ్డి ఆసుపత్రికి రోగులు వెళ్లాలంటే దూరభారం తగ్గుతుందని, ప్రజలు వివిధ రకాల ఇబ్బందులు పడుతున్నారని దోమకొండ 4 మండలాలకు సెంటర్ పాయింట్‌గా ఉన్నందున 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి షబ్బీర్‌అలీ తీసుకెళ్లారు.

దోమకొండలో 100 పడకల ఆసుపత్రికి అనువుగా ఉన్న స్థలం

ప్రభుత్వం దోమకొండలో 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తే గర్భిణులకు ఇక్కడే సేవలు అందనున్నాయి. వైద్యులు ప్రసవాలు కూడా దోమకొండలోనే చేసే అవకాశం ఉంది. వీటితో పాటు మూత్ర పరీక్ష, రక్త పరీక్ష, ఎక్స్‌రే, స్కానింగ్, వివిధ రకాల ఆపరేషన్‌లు జరిగే అవకాశాలున్నాయి.

24 గంటల పాటు వైద్యులు అందుబాటులో..

దోమకొండ మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటైతే సుమారు పల్వంచ, మాచారెడ్డి, దోమకొండ, భిక్కనూర్, బీబీపేట మండలాలలోని 50 గ్రామాలకు పైగా ప్రజలకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. 24 గంటల పాటు అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉండనున్నారు. పల్వంచ మండల కేంద్రం నుంచి దోమకొండ 6 కిలో మీటర్లు, బీబీపేట 10 కిలో మీటర్లు, భిక్కనూర్ 8, మాచారెడ్డి 16 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. 4 మండలాల ప్రజలకు దోమకొండ అందుబాటులో ఉంటుంది.

కలగా మిగిలిన 100 పడకల ఆసుపత్రి

దోమకొండలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో వివిధ శాఖల మంత్రులకు దోమకొండ మండల ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం ఉన్నటువంటి 30 పడకల ఆసుపత్రిలో ఓపీ ఎక్కువ ఉండటంతో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి పూర్తి వైద్యం అందలేకపోతోంది. ఏదైన ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భంలో, ఇతర వ్యాధులకు సంబంధించిన రోగులు కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి వెళ్లక తప్పడం లేదు. దీంతో బీబీపేట నుంచి కామారెడ్డి ఆసుపత్రికి రోగులు వెళ్లాలంటే 30 కిలో మీటర్ల దూరం వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. 4 మండలాలకు చెందిన ప్రజల యొక్క కళగానే మిగిలి ఉంది.

షబ్బీర్‌అలీ చొరవతో ఆసుపత్రి మంజూరయ్యేనా?

పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మరుసటి రోజునే ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లెటర్ రాశారు. కామారెడ్డి జిల్లాకు సంబంధించిన ముఖ్యమైన అవసరాలతో పాటు దోమకొండలో 100 పడకల ఆసుపత్రి, అలాగే డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని సీఎంకు రాసిన లెటర్‌లో పేర్కొన్నారు. గతంలో కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షబ్బీర్‌అలీ రాష్ట్ర విద్యుత్ శాఖ, బొగ్గు, మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ ఉర్దూ అకాడమీ శాఖ మంత్రిగా ఉన్న 2008 సంవత్సరంలో దోమకొండలో ప్రసుత్తం ఉన్నటువంటి 30 పడకల (సీహెచ్‌సీ)ఆసుపత్రిని అప్పటి మెదక్ ఎంపీ అలే నరేంద్రతో కలసి ప్రారంభించారు. ఇప్పుడు కూడా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న షబ్బీర్‌అలీ దోమకొండలో 100 పడకల ఆసుపత్రి మంజూరుకు ప్రత్యేక చొరవ తీసుకుంటారని ఇక్కడి మండలాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఫసల్ బీమా యోజన వెంటనే అమలు చేయాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, మే 18: రైతు పెట్టుబడికి భరోసాగా తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలపై ఆర్ అంటే రాహుల్, ఆర్ అంటే రేవంత్ టాక్స్‌తో పాటు యు అంటే ఉత్తం టాక్స్ కూడా పెట్టారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 43 రూపాయలకు కిలో బియ్యం అందించాలని చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.57లకు టెండర్లకు ఆహ్వానిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైస్‌మిల్లర్లతో చీకటి ఒప్పందం చేసుకొని రైతులను నష్టపెడుతుందన్నారు. రాష్ట్ర సివిల్ సప్లై అధికారులు పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారని అన్నారు. ఆరు గ్యారంటీలో ఒక్కటైనా పంటకు రూ.500 బోనస్ ఇస్తానని ఇప్పుడు సన్న వడ్లకే అనడం కాంగ్రెస్ మాటల గారడికి నిదర్శనమన్నారు. నగరంలో మున్సిపల్ పరిధిలో డ్రైనేజీ అస్తవ్యస్థంగా ఉందని గత నాలుగు రోజుల్లో కురిసిన మోస్తారు వర్షాలకే ప్రజలు ఇబ్బంది పడ్డారని కమీషనర్ మున్సిపల్ అధికారులకు గత కొద్దిరోజుల నుంచి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అస్తవ్యస్థంగా ఉన్న డ్రైనేజీపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇందులో బీజేపీ నాయకులు న్యాలం రాజు, భారత్ భూషన్, లక్ష్మీనారాయణ, ఆకుల శ్రీనివాస్, మధు, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మారం(బి) బ్రహ్మంగారి ఆలయంలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు, భక్తులు

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

డిచ్‌పల్లి, మే 18: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మంగారి 331 ఆరాధనోత్సవాలు కన్నులపండుగగా సాగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కుంకుమ అర్చనల్లో పాల్గొన్నారు. కర్నూల్ జిల్లా కందిమల్లయ్య పల్లి గ్రామంలో బ్రహ్మంగారి ఆలయంలో చేసే ఆరాధోనత్సవాలకు దీటుగా ధర్మారంలో ఆలయంలో నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు రావుల బ్రహ్మానందం తెలిపారు అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు శ్యామ్, సాయిలు, గంగారాం, మురళి, నాగరాజు, గంగాధార్, పెద్దసంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

..కన్యకా పరమేశ్వరీ జన్మదిన వేడుకలు

ధర్పల్లి, మే 18: మండల కేంద్రంలో శనివారం మాతా కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మంగళహారతులతో గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా వాసవి మాతా పారాయణం, కుంకుమార్చన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దొంతుల రాజశేఖర్, నూకల రాజయ్య, నూకల గంగాధర్, లాబిశెట్టి సిద్దేశ్వర్, లాబిశెట్టి మహేష్, ప్రవీణ్, పాత రాములు, రాజశేఖర్, రవి, గంగాదాసు, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

..పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

ఇందల్వాయి, మే 18: మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో శనివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మహిళలు ఇంటికొక బోనం తీసి డీజే చప్పుళ్ల మధ్య గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆదివారం బహిహరణంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని సంఘ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

యూనిఫాంలు కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే : డీఆర్‌డీవో పీడీ

డిచ్‌పల్లి,మే 18: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే బాధ్యతను ప్రభుత్వం మహిళ సంఘాలకే అప్పజెప్పిందని, పాఠశాలలు ప్రారంభమయ్యేలోగా యూనిఫాంలు తయారు చేసేల చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్ అన్నారు. శనివారం ఇందూరు జిల్లా మహిళ సహకార సమాఖ్య కార్యవర్గ సమావేశం డిచ్‌పల్లి టీటీడీసీలో జరిగింది. ఈ సమావేశానికి పీడీసాయాగౌడ్ హాజరై మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వార స్కూల్ విద్యార్థులకు యూనిఫాలు కుట్టే అవకాశం కల్పిస్తున్నమని కమిటీ ల ద్వార ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా యూనిఫాంలు తయారు చే సేల చర్యలు తీసుకోవలన్నారు. మరుగు దోడ్లు, ప్రహరీ లేని పాఠశాలల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వార నిర్మించేలా చర్యలు తీసుకుంటమన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో మాట్లాడుతూ.. డ్వాక్ర సంఘాలకే యూనిఫాంలు కుట్టే బాధ్యత ప్రభుత్వం అప్పగించడం గొప్ప విషయమని ఈ అవకాశం సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు శ్రీనివాస్, సంధ్యరాణి, నీలిమా, సాయిలు, మారుతి, స్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, కల్చరల్ కో ఆర్డినేటర్ అష్ట గంగాధర్, డీఎంసీ అధ్యక్షురాలు రాధ, కోశాధికారి లక్ష్మీ, జిల్లా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాల్లో నీటి సమస్య తీర్చండి'

మోపాల్, మే 18: గ్రామాల్లో నీటి సమస్య తీరనుందని సమస్యపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య తప్పడం లేదని సిర్పూర్ ఎంపీటీసీ రఘు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మోపాల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిర్పూర్ ఎంపీటీసీ రఘు మాట్లాడుతూ ఎండల తీవ్రతతో గత కొన్ని రోజుల నుంచి గ్రామాల్లోని కొత్త ప్లాట్లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లింగం మాట్లాడుతూ ఈ వేసవిలో మండలంలోని కాల్పూర్, సిర్పూర్ గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం తాము కృషి చేస్తామని తెలిపారు. రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలను సొసైటీలలో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారి ప్రజాప్రతినిధులకు వివరించారు. రైతులు విత్తనాలు, ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు 2కోట్ల 15లక్షలు మంజూరు చేసిందని వివరించారు. పాఠశాలలో నీటి సమస్య, మరుగుదొడ్ల సమస్య, పాఠశాల పైకప్పు, విద్యుత్ సరఫరా మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఎంపీపీ లత మాట్లాడుతూ తమ ఐదేళ్ల కాలంలో మండలాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేశామని మరికొద్దిరోజుల్లోనే తమ పదవీ కాలం ముగియనుందని తెలిపారు.

అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రులను సీజ్ చేయాలి : సీఐటీయూ

పెద్దబజార్, మే 18: అనుమతి లేని ప్రైవేటు ఆసుపత్రిలను సీజ్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. శనివారం నగరంలోని డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖిల్లా రోడ్‌లో ఉన్న షాహిన్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిళ గర్భాశయాన్ని తొలగించినట్లు అన్నారు. వైద్యపరమైన నిర్లక్ష్యం వల్ల 24ఏళ్ల వయస్సులో ఉన్న మహిళకు శాశ్వతంగా గర్భాశయాన్ని తొలగించారు. బాన్సువాడ మండలానికి చెందిన ఫిర్దోస్ అనే మహిళ డెలివరీ కోసం షాహిన్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. ఏప్రిల్ 20న డిచ్చార్జ్ చేశారని తెలిపారు. ఏప్రిల్ 25న రాత్రి 11.30లకు ఆమెకు విపరీతమైన కడుపు నొప్పి, రక్తస్రావం కావడంతో షాహిన్ ఆసుపత్రికి తరలించారని అన్నారు. అక్కడి వైద్యులు మనోరమ ఆసుపత్రికి రిఫర్ చేయడంతో దీంతో ఆమెకు స్కానింగ్ చేసి చూడగా ఆమె గర్భాశయం పూర్తిగా తొలగించారని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోపాల్, మే 18: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఠానాకుర్దు గ్రామ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నీరడి లక్ష్మి (45) మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గాంధారి మండలం బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన సాయికుమార్, తల్లి లక్ష్మి కలిసి మోటార్ సైకిల్‌పై నిజామాబాద్ వస్తుండగా ముందుగా వెళ్తున్న బైకు సడన్‌గా మలపడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించింది. మరో ఇద్దరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హనుమాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య లోపం

● ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థ ● ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



హనుమాజీపేట్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే..


ఆసుపత్రి ఆవరణలో పడి ఉన్న వ్యర్థ పదార్థాలు, గ్లూకోజ్ బాటిళ్లు


ఆసుపత్రి ఆవరణలో పగిలిన డ్రైనేజీ పైప్‌లు

బాన్సువాడ, మే 18 : గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల ఆరోగ్య బాగు కోసం పల్లె ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోగులు పేద ప్రజలు రోగాల బారిన పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి హుషారుగా ఇంటికి వెళ్తారు. కాని ఇక్కడ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు గాని వారి వెంట వచ్చే వారికి కాని సిబ్బందికి దుర్వాసన వ్యర్థ పదార్థాలతో వెదజల్లుతున్న దుర్వాసనతో అనారోగ్యం బారిన పడాల్సిన పరిస్థితి దాపురించిందని అక్కడి వైద్య సిబ్బంది పేర్కొనడం గమనార్హం. అంతేకాకుండా అన్ని ఉన్న అల్లుళ్ళ శని అన్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిధులు ఉన్నప్పటికీ ఏ ఒక్క ఉన్నత అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని పర్యవేక్షించిన దాఖలాలు లేవని, అలాగే మరమ్మతులకు నోచుకోక ఆరోగ్య కేంద్రం అనేక సమస్యలతో సతమతమవుతుంది. గత సంవత్సరం పాటుగా ఆరోగ్య కేంద్రంలో నీటి సరఫరా లేక మరుగుదొడ్లలో నీరు లేక బాత్ రూమ్‌లో నీరు లేక వ్యర్థ పదార్థాలు ఎక్కడికి అక్కడే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని సిబ్బంది రోగులు పేర్కొనడం పట్ల అధికారుల పర్యవేక్షణ ఎంత ఉందో ఇంతే అర్థమవుతుంది. అంతేకాకుండా ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం డ్రైనేజీ పైప్‌లైన్లు పగిలిపోయి బయటకు వెళ్లలేక ఆసుపత్రిలో నీరు సరఫరా కాక దుర్వాసన వెదజల్లుతుందని సిబ్బంది పేర్కొంటున్నారు. అలాగే నీటి పైప్‌లైన్ కూడా పూర్తిగా చెడిపోయిందని దాని ద్వారా ఆసుపత్రిలోకి నీరు రావడం లేదని ఆసుపత్రికి వచ్చే సిబ్బంది గాని రోగులకు నీటి సరఫరా లేక నానా అవస్థలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. దుర్వాసన విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఇంతకు ముందు సమాచా రామిచ్చినట్లు ఫార్మసిస్ట్ రామకృష్ణ తెలిపారు. ఇలా ఉంటే మరో వైపు వైద్యుల కొరత సిబ్బంది కొరతతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య మందక బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలివెళుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు ఉన్న ఆచరణకు నోచుకోక వైద్యుల కొరత సిబ్బంది కొరతతో అటు ఆసుపత్రి నిర్వహణ లేకపోవడం ఇటు రోగులకు సరైన వైద్యం లేక ఆసుపత్రి రోజురోజుకు రోగుల సంఖ్య తగ్గుతుందని సిబ్బంది తెలిపారు. ఇంత జరుగుతున్న జిల్లా ఉన్నతాధికారులు మాత్రం ఒక్కసారి కూడా ఆరోగ్య కేంద్రం వైపు వచ్చి చూసిన దాఖలు లేవని గ్రామస్తులు రోగులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లోనే మెడిసిన్ గదిని ఏర్పాటు చేయడం పిల్లలకు కావాల్సిన అక్యుమెంటరీ కూడా అందుబాటులో ఉన్న వైద్యులు లేక నిర్వహణ చేయకపోవడం జరుగుతుందని రోగులు పేర్కొంటున్నారు. ఇప్పటి కైనా ఆసుపత్రిలో దుర్వాసన వెదజల్లకుండా వెంటనే మరమ్మతులు చేయించి ఆసుపత్రి ఆవరణం శుభ్రపరిచి డ్రైనేజీ వ్యవస్థను నూతనంగా నిర్మించాలని సిబ్బంది రోగులు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఒక వైద్యులు ఒక స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయని సిబ్బంది తెలిపారు. గతంలో ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీలు చేసిన రోజుల్లో ఉండేవని వైద్యులు లేక సిబ్బంది గర్భిణీలను బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు హనుమాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు, సిబ్బంది కోరుతున్నారు.

డ్వాక్రా రుణ బకాయిల రికవరీకి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ డీపీఎం సుధాకర్

నాగిరెడ్డిపేట, మే 18: డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాలను, స్త్రీ నిధి రుణాల బకాయిలను సక్రమంగా రికవరీ అయ్యేలా వీవోఏలు కృషి చేయాలని సెర్ప్ డీపీఎం సుధాకర్ కోరారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గాను బ్యాంకు లింకేజీ లక్ష్యం రూ.40 కోట్లకు కాగా అర్హత గల సంఘాలను గుర్తించి వారికి బ్యాంకు లింకేజీ ద్వారా సకాలంలో రుణాలు ఇప్పించాలని కోరారు. గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు స్కూల్ యూనిఫాం కుట్టడానికి మహిళా సంఘాల సభ్యులకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మండలంలో ఉన్న అన్ని పాఠశాలల పిల్లలకు 7,900 యూనిఫాంలు కుట్టడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అక్వాకల్చర్‌ను గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటుకు పీఎంఈజీపీ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీతో చేప పిల్లలను పెంచి వ్యాపారం చేయుటకు మహిళా సంఘాలలో ఆసక్తి ఉన్న సభ్యులను గుర్తించాలని వారికి శిక్షణ ఇప్పించి వారికి జీవనోపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీష్ కుమార్, సీసీలు దత్తు, నారాయణ, రమేష్, సాయిలు, రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత, మండల సమైక్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, మే 18: నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఏఎస్ఐ అబిబ్‌బేగ్, గ్రామస్థులకు సైబర్ నేరగాళ్ల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, ఎవరైనా వ్యక్తులు ఫోన్ చేసి మీ యొక్క ఆధార్ నెంబర్ గాని, ఏటీఎం నెంబర్ గాని అడిగితే చెప్పకూడదని, ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డ్రా చేసే టైంలో చుట్టూ పక్క వారు కనిపిస్తే ఎవరికి కూడా మీ ఏటీఎం పిన్ నెంబర్ చెప్పకూడదని, నిత్యం బైక్‌పై వెళితే తప్పనిసరిగా హెల్మెట్, వెహికిల్ ధ్రువ పత్రాలు లైసెన్స్ తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ అవగాహన సదస్సులో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పని చేయని సీసీ కెమెరాలు


నసురుల్లాబాద్‌లో బస్టాండ్ సమీపంలో పని చేయని సీసీ కెమెరాలు

నసురుల్లాబాద్, మే 18 : నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రజల సౌకర్యాల మేరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో నిత్యం రహదారిపై ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగితే గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాని ఇప్పుడు సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ప్రమాదాలు జరిగితే ఎలా కనిపెట్టాలో అర్థం కాకుండా ఉన్నాయి. ఇటీవల కాలంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల్లో కొందరి ప్రాణాలు కూడాపోయిన గుర్తించలేకపోయినా పోలీస్ అధికారులు, అదే సీసీ కెమెరాలు పని చేస్తే ప్రమాదం జరిగిన వెంటనే ఆ వాహనదారులను పట్టుకునే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోయింది. అధికారులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నుంచి ఏవైనా సంఘటనలు జరిగితే పట్టుకునే వీలుంటుందని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పిట్లం,మే 18:మండలంలోని గౌరారం తండాలో విద్యుదాఘాతంతో మహిళ మంజుల(30) మృతి చెందినట్లు ఎస్సై నీరేష్ తెలిపారు. గౌరారం తండాలో శనివారం మంజుల తన ఇంటి వద్ద 11 గంటల సమయంలో బట్టలు ఉతికి ఇంటి ముందు ఉన్న రేకులపై బట్టలు ఆరబెట్టడానికి వెళ్లగా అప్పటికే విద్యుత్‌సప్లయి రేకులకు ఉండడంతో తెలియక, బట్టలు ఆరబెడ తామని బట్టలు వేయగా విద్యుదాఘాతానికి గురై, పక్కనే ఉన్న కొడుకు ప్రదీప్ తల్లిని కాపాడుదామని వెళ్లగా అతనికి కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడని అది గమనించిన తండా వాసులు వెంటనే విద్యుత్ సప్లయి తీసివేసి విద్యుదాఘాతానికి గురైన వారిద్దరిని ఆసుపత్రికి తీసుకవెళ్లగా మార్గమధ్యలో మంజుల మృతి చెందగా ప్రదీప్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.మృతురాలికి ముగ్గురు కొడుకులు ఉన్నారు.మృతురాలి భర్త లచ్చిరాం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలకు కూలీ రూ.300లకు పెంచాలి

డిచ్‌పల్లి, మే 18: మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు రోజు కూలీ రూ.300ఇవ్వాలని అఖిల భారతీయ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఘన్‌పూర్, చెరువులో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడుతూ.. అనేక పోరాటల ఫలితంగానే జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, కూలీలకు రోజు వారి కూలీ రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలీలకు నిధుల కొరత సృష్టిస్తే సహించేదిలేదన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిత్యవసర సరకుల ధరలు పెంచి సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మురళి, సాయిబాబా, మోహన్, మహిపాల్, గంగాధర్, బాబు, సాయిలు, లక్ష్మీ, సుజాత, పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు వ్యాయామ లక్ష్యాన్ని ఎంచుకోవాలి

పెద్దబజార్, మే 18: ఆరోగ్య జాగ్రత్తలు చాలా అవసరమని ప్రతీ ఒక్కరు వ్యాయామ లక్ష్యాన్ని ఎంచుకోవాలని డాక్టర్ అజేంద్ర శ్రీకాంత్ అన్నారు. శనివారం నగరంలోని మనోరమా ఆసుపత్రి ఎదురుగా బీపీకి సంబంధించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తల పట్ల నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యానికి గురవుతున్నారని బీపీలు వంటి జబ్బులకు గురి కాకుండా ఉండాలంటే ఖచ్చితంగా ఫాస్ట్‌ఫుడ్, అధిక ఉప్పు, కొలస్ట్రాల్‌కు సంబంధించిన పదార్థాలను నియంత్రించాలన్నారు. భారతదేశంలో బీపీ వంటి వ్యాధి గ్రస్తులు అధికమై అనేక రోగాలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా ప్రతిరోజు వ్యాయామాలు, వాకింగ్, స్విమ్మింగ్ చేస్తే ఖచ్చితంగా ఆరోగ్యవంతులుగా ఉండగలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కట్ట నర్సింహా, ఇతేష్‌కుమార్, నర్సయ్య, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నాళేశ్వర్‌లో సరిన్‌ను పరామర్శించిన బీజేపీ నాయకుడు మోహన్ రెడ్డి

నవీపేట,మే18: మండలంలోని నాళేశ్వర్, నిజాంపూర్, కమలాపూర్‌లలో బాధిత కుటుంబాలను శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ. మోహన్ రెడ్డి పరామర్శించారు. నాళేశ్వర్‌కు చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్ బావమరిది సృజన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే నిజాంపూర్, కమలాపూర్‌లలో సైతం బాధిత కుటుంబాలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాగేపూర్ సొసైటీ చైర్మన్ శైలేష్ కుమార్, రచ్చ సుదర్శన్, మల్లెపూల గంగాధర్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సన్మానం


విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందజేస్తున్న వేవా సభ్యులు

పెర్కిట్, మే18: ఆర్మూర్ డివిజన్ విశ్వకర్మ ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 35మంది విద్యార్థులకు ప్రొఫెసర్ జయశంకర్ ప్రతిభ పురస్కారంలో శాలువ, సిల్వర్ మెడల్, ప్రశంసా పత్రంతో సన్మానిం చారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముప్కాల్ ఎస్సై భాస్కరచారి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు పేరు నిలపాలని అన్నారు. నిజామాబాద్ తహసీల్దార్ నాగార్జున విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు గద్దె గంగాధర్, మహిళ ప్రాంగణం అధికారిణి పద్మ, వేవా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఉప్పల నటరాజ్, పాడపల్లి రాజారాం, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వెంకట రమణ, నాగరాజు, గంగాధర్, శివాజీ, రవీంద్ర, శంకర్, 13మండలాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తపస్వీ ఉపాధ్యాయులకు శిక్షణ

ఆర్మూర్‌టౌన్, మే18: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని తపస్వీ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఎక్స్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్, అడ్వకేట్ శ్యామల తపస్వీ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిహండ్ ది క్లాస్‌రూం అనే నామకరణంతో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య, జీవన భాష నైపుణ్యాలు, సామాజిక స్పృహ, సెంటిఫిక్ థింకింగ్, యోగధ్యానము, బాలల హక్కుల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తపస్వీ చైర్‌పర్సన్ ఫౌండర్ పద్మవతి, అధ్యక్షుడు సుశీల, కార్యదర్శి దీలిప్‌రెడ్డి, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ ఛైర్మన్ గంగాధర్, లిక్కి. శంకర్, శ్రీనివాస్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో పొగతో ఉక్కిరిబిక్కిరి

ముప్కాల్, మే18: బాల్కొండ మండలం నుంచి ముప్కాల్ వెళ్లే రహదారుల పక్కన వరికొయ్యాలకు నిప్పుపెట్టడంతో దట్టమైన పొగ కమ్ముకోవడం ప్రయాణికులకు ఊపిరిపిల్చుకోలే ఉక్కిరిబిక్కిరి అయ్యారు. రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకుండా మారింది. వరి కొయ్యాలకు నిప్పుపెట్టడం వల్ల పంట భూముల్లో పోషకాల శాతం తగ్గే అవకాశం ఉందన్నారు. సారవంతమైన భూమిలో కర్బన్‌లోని మొక్కలకు అన్ని పోషకాలు ఉంటాయని వరికొయ్యాలు నిప్పుపెట్టడంతో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, వాతావరణం కలుష్యం, రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం కాలిపోయి ఆస్తినష్టం, రోడ్డు పక్కన హరితహరం చెట్లు కాలిపోయి నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

పెర్కిట్‌లో చౌడేశ్వరిమాత ఆలయ వార్షికోత్సవం

ఆర్మూర్‌రూరల్, మే18: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో దేవాంగ సంఘం ఆధ్వర్యంలో శనివారం చౌడేశ్వరీమాత ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌడేశ్వరీ మాతకు అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించగా భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు గుండెం రమేష్, సుదర్శన్, మధు, దేవాంగ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవీపేట,మే18: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన రావుల మల్కవ్వ(58)అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి మల్కవ్వ తన బెడ్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయి ఉందని అన్నారు. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేవని ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలికి భర్త మారన్న, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మల్కవ్వ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆమె సోదరుడు సాయిలు ఫిర్యాదు చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలి సోదరుడు సాయిలు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు

●పిల్లర్ల దశలోనే ఏళ్లుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ● అద్దె భవనంలో కొనసాగుతున్న వైనం ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు

భీమ్‌గల్ రూరల్, మే18: ప్రభుత్వాలు మారినా ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. సొంత భవనాలు లేక ప్రభుత్వ కార్యాలయాలు వెల వెల బోతున్నాయి. దీంతో ప్రజల కష్టాలు తీరడం లేదనే చెప్పవచ్చు. భీమ్‌గల్ గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీకి రూపాంతరం చెందిన అభివృద్ధికి ఆమడ పెట్టు దూరంలో వుంది. భీమ్‌గల్ మండలం నుండే కాకుండా ఇతర మం డ లాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో భూ రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. ఆదాయం ఘనంగా ఉన్న సొంత భవనం లేక అద్దెభవనంలోనే ఏళ్లుగా సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. భీమ్‌గల్ పట్టణంలోని చొక్కయ్య గుట్ట ప్రాంగణంలో సుమారు ఐదేళ్ల క్రితం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నూతనభవనానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి నూతన భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

● ఏళ్లు గడుస్తున్నా వీడని గ్రహణం

భీమ్‌గల్, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు పదుల సంఖ్యలో భూక్రయ విక్రయాలు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ తదితర పనుల నిమిత్తం భీమ్‌గల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తుంటారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానకి సొంత భవనం లేక అద్దె భవనంలో కొనసాగుతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 2020 సంవత్సరంలో చొక్కయ్యగుట్ట సమీపంలో ఎకరం న్నర స్థలంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంఖుస్థాపన చేశారు. ఆరంభం ఘనంగా వున్నప్పటికి ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కా ర్యాలయానికి పిల్లర్లు పోసి వదిలివేశారు. ఇ ప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభం కా లేదు. ప్రజాప్రతినిధులు మారినా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పనులు ఎక్కడ వేసిన గొం గళి అక్కడే అన్న చందంలా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రక్కనే వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణం పూర్తి కావస్తోంది. అతి తొందరలోనే ప్రారంభానికి ముహూర్తం ఖరారు కాబోతోంది. ప్రక్కనే ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసంపూర్తి భవనం పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తోంది. ప్రస్తుతం భీమ్‌గల్ పట్టణంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాయలం బడాభీమ్‌గల్ రోడ్డులో గల అద్దె భవనంలో కార్యాకలాపాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా కొత్తప్రభుత్వంలో నైనా మూలన పడ్డ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పూర్తవుతుందని భీమ్‌గల్ పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


అసంపూర్తి దశలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఘనంగా వాసవీ మాత జన్మదిన వేడుకలు

కామారెడ్డిటౌన్,మే 18: కామారెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈసందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు కలశాలను అమ్మవారికి సమర్పించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ హాజరై పూజలు నిర్వహించారు.ఆలయానికి సంబంధించిన ఏ అవసరమైన తన దృష్టికి తీసుకువస్తే తగిన ఏర్పాట్లు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్‌శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్:బీర్కూర్ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో శనివారం ఆర్యవైశ్య కుల దేవత వాసవి కన్యాకా పరమేశ్వరి జన్మదిన వేడుకలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు.తీర్థ ప్రసాదాలుఅందజేశారు. ఈకార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

పిట్లం:మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘంలో ఆర్య వైశ్యులు ఘనంగా శ్రీవాసవికన్యాక పరమేశ్వరి మాత జన్మదిన వేడుకలు జరిపినారు.శనివారం కన్యాకపరమేశ్వరి మాత జన్మదినం సందర్భంగా వాసవీ మాత ప్రత్యేకంగా మహిళలు పూజలు చెశారు. వేదపండితులు శేఖర్‌పంతులు వాసవిమాత జన్మదినం పురస్కరించుకొని ప్రత్యేకంగా కుంకుమార్చన పూజలు మహిళతో చేయించారు.ఆనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టిన్నారు.ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, వైశ్యులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: వాసవీ మాత జన్మదిన ఉత్సవాలు మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక ఆర్య వైశ్య సంఘం భవనంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు గ్రామంలో ర్యాలీ జరిపారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాన్సువాడటౌన్: పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరంలో శనివారం ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో వాసవిమాతా జన్మదిన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు ఉన్నారు.


బాన్సువాడలో వాసవిమాతా జన్మదిన ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

గాంధారి: గాంధారి మండలంలో వాసవీమాత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.శనివారం మండల కేంద్రంలోని వాసవీ సంఘం ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున కళాశాలలతో వాసవీ ఆలయానికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో అన్నదాన కారక్రమాన్ని ఏర్పాటుచేశారు.

తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రంలో శనివారం తాడ్వాయి మండలం ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవీ కన్యక పరమేశ్వరి దేవి జన్మదిన ఉత్సవాల్లో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకపరమేశ్వరి దేవి జన్మదిన ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వైశ్యులు ఎంతో కష్టపడి పనిచేస్తారని వారి అభ్యున్నతికి కృషిచేస్తానని తెలిపారు. కన్యకా పరమేశ్వరి మాత ఉత్సవాలు ప్రతీ సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు చంద్రయ్య,రమేష్, బాస్కర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: ఆది పరాశక్తి మరో రూపమే వాసవి కన్యకా పరమేశ్వరి అని ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు కౌడ శ్రీనివాస్ అన్నారు. ఆయన శనివారం లింగంపేట మండల కేంద్రంలో కన్యకా పరమేశ్వరి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కుసుమశ్రేష్ఠి, కుసుమాంబలకు ఆది పరాశక్తి కనిపించి నేను ఉమా మహేశ్వరిని నేను లోక కల్యాణం కోసం మీ కుమార్తెగా జన్మిస్తున్నానని చెప్పినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు ఆమెకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు,పలకీ పూజ, శోభాయాత్రలు నిర్వహించారు. కార్యక్రమంలో వైశ్యులు కొత్త సంతోష్, కాటిపల్లి శ్రీధర్, పర్షి పవన్, జక్సాని దత్తురాంలు, కాటిపల్లి నాగరాజు, దేవేందర్, కౌడ రవిలతో పాటు వైశ్యులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా మలిదశ ఉద్యమకారులకు సన్మానాలు

బాన్సువాడ, మే 18 : ఉమ్మడి జిల్లా మలిదశ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్‌ని శనివారం బాన్సువాడ డివిజన్ మలిదశ ఉద్యమకారుల సంఘం తరపున ఘనంగా సన్మానించారు. బాన్సువాడ మలిదశ ఉద్యమకారుల ఫోరమ్ ఉద్యమ సమయంలో తాము ఎదుర్కొన్న కేసులు చేసిన ఉద్యమం ఎదుర్కొన్న కష్టాలు, అక్రమ కేసుల ఇతర అంశాలను మలిదశ ఉద్యమం ఫోరం ఆధ్వర్యంలో వివరించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అండగా ఉంటానని పేర్కొనడం జరిగిందన్నారు. ఉద్యమకారులకు ఎంతో మనోధైర్యాన్ని నింపింది. ఉద్యమకారులకు సముచిత స్థానం సమాజంలో కల్పిస్తానని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ఉద్యమకారుల బాన్సువాడ డివిజన్ తరపున మేమంతా రుణపడి వుంటామని తెలియజేశారు. త్వరలో జిల్లా ఉద్యమ ఫోరం తరపున బాన్సువాడ డివిజన్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుల డివిజన్ సెక్రటరీ ఉడుత గంగాధర్, ఉద్యమ ఫోరం డివిజన్ ముఖ్య సలహాదారు పెద్ద పట్లోళ్ల దేవేందర్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ వై.కృష్ణ, చందు, మండల్ యూత్ సెక్రటరీ భీమ్లా నాయక్, మండల ముఖ్య సలహాదారు దండు విజయ్‌కుమార్, సీనియర్ ఉద్యమ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న వైనం
- అధికారుల హెచ్చరికలు బేఖాతరు

బాన్సువాడ టౌన్, మే 18: బాన్సువాడ పట్టణంలో ఇష్టారీతిన వాహనాల పార్కింగ్‌తో ప్రజల రాకపోకలకు పరేషాన్ పట్టుకుంది. ఎవరికి తోచిన విధంగా వారు తమతమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలమవుతునే ఉంది. బాన్సువాడ మున్సిపాలిటీగా మారిన తర్వాత శరవేగంతో అభివృద్ధి చెందింది. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక నిధులతో బాన్సువాడ ప్రధాన రహదారిని సీసీతో నిర్మాణం చేయించారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయించి అందులో మొక్కలను, వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. అంతేకాకుండా ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్ కోసం పసుపురంగు పట్టీలను ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు మాత్రం తమకు నచ్చినట్టుగా వాహనాలను పార్కింగ్ చేస్తుండడం ప్రజలకు ఇబ్బందిగా మారింది.

రోడ్లపైనే వాహనాల నిలిపివేత

బాన్సువాడ మున్సిపాలిటీలో రద్దీ బాగా పెరిగింది. నిత్యం చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం బాన్సువాడకు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనదారులు మాత్రం రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పసుపుపట్టీలోపు కాకుండా బయటవైపు కూడా పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారు. పోలీసు అధికారులు పలుమార్లు హెచ్చరించినా వాహనదారుల్లో మాత్రం మార్పు కానరావడం లేదు. జరిమానాలు విధించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది పరిస్థితి. ముఖ్యంగా రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రమవుతోంది.

రద్దీ ఉన్న ప్రాంతాల్లో తీవ్రమవుతున్న సమస్య

బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. బ్యాంకులు, బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ జాం అవుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడ వెళ్లే దారిలో నాలుగు బ్యాంకులున్నాయి. యూనియన్, హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా, తెలంగాణ గ్రామీణ బ్యాంకులు. ఈ దారిలో వాహనదారులు ఇష్టారీతిన వాహనాలను పార్కింగ్ చేస్తుండడం, ఇదే దారిలో ప్రతీరోజు కూరగాయల విక్రయాలు కూడా జరుగుతుండడంతో ఉదయం, సాయంత్రం వేళలో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. అదే విధంగా ప్రధాన రహదారిలో, తాడ్కోల్ రోడ్డులో ఎస్‌బీహెచ్ బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకుల ఎదుట వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేస్తున్నారు. ఒక్కోసారి ఏకంగా రోడ్లపైనే వాహనాలుంటున్నాయి.



బాన్సువాడ ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు (ఫైల్)

అధికారులు చర్యలు తీసుకోవాలి

బాన్సువాడ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు. పార్కింగ్ లైన్ బయట వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భారీ జరిమానాలు విధిస్తే తప్ప వాహనాదారుల్లో మార్పు కానరాదనే చర్చలు కొనసాగుతున్నాయి. ఏదిఏమైనప్పటికీ అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రసాయన ఎరువులతో సహజత్వాన్ని కోల్పోతున్న భూములు



రైతులు తయారు చేసిన సేంద్రీయ ఎరువులు (ఫైల్)

మద్నూర్, మే 18: అధిక దిగుబడి సాధించేందుకు రైతులు విరివిగా రసాయన ఎరువులు వాడుతున్నారు. పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, వర్మీ కంపోస్టు, వాన పాముల ఎరువులు తదితర సహజ ఎరువులు వాడకపోవడంతో రోజు రోజుకూ భూములు సహజత్వాన్ని కోల్పోయి భూ సారం తగ్గుతోంది. మోతాదుకు మించి సహజ ఎరువులు వాడటంతో ముతక లోహాలు క్షీణిస్తున్నాయి. ఇది ముందు ప్రమాదకరమని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూసార పరీక్షలు అందుబాటులో వచ్చినా ఎక్కువ మంది రైతులు మట్టి పరీక్షలు చేయించడం లేదు. భూసార పరీక్షలతో కలిగే లాభాల గురించి రైతులకు చెబుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యవసాయాధికారులు వాపోతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పరీక్షలు చేస్తే మంచిది

నేడు ప్రతీ మండలంలో రైతు వేదికలు అందుబాటులోకి వచ్చాయి. అయితే అక్కడ భూ సార పరీక్షలు చేసే కిట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. భూ సార పరీక్షలు నిర్వహించే కిట్లు ఏర్పాటు చేస్తే రైతులకు అందుబాటులో ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో భూ సార పరీక్షలు నిర్వహిస్తే చాలా మంది రైతులు పరీక్షలు చేయించే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఎక్కడో దూరానికి తీసుకెళ్లడం, చాలా రోజుల పాటు వేచి చూడటం వల్ల రైతులకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వల్ల భూమి సహజత్వాన్ని కోల్పోతుంది. ఏడాదిలో ఒక భూమిలో కనీసం రెండు వేర్వేరు పంటలు పండించాలి, అలా చేస్తేనే అన్ని రకాల భూ సార పంటలకు దిగుబడి పెరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

భూముల్లో చెరువులు, కుంటల మట్టి వేయాలి

భూముల్లో పంటలు పండించే రైతులు తమ భూములలోకి పశువుల పేడ, మేకలు, గొర్రెల ఎరువు వాడితే దిగుబడి పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కుంటల్లోని మట్టికి శక్తి ఉంటుందని, దీంతో భూములకు సహజత్వం ఉంటుందని, ట్రాక్టర్లతో మట్టిని వేసుకోవాలని సూచిస్తున్నారు. భూమి పైన పొర సారవంతంగా మారి, భూముల్లో నత్రజని, భాస్వరం, పొటాషం శాతం పెరిగి దిగుబడి పెరిగే అవకాశాలుంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పరం పరాగత్ కృషి యోజన పథకాన్ని 2019లో ప్రవేశ పెట్టి దీని ద్వారా రైతులకు సేంద్రీయ ఎరువులు తయారు చేసుకునే సామాగ్రి అందజేశారు. రైతుల్లో దీనిపై ఆసక్తి తగ్గిపోవడంతో ప్రభుత్వం సరఫరా చేయలేక పోతుంది. ఏది ఏమైనా భూముల్లో సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



రైతులు తయారు చేసిన కంపోస్టు ఎరువు





వివేకానందకాలనీలోని కోర్టు సమీపంలో రోడ్డుపై మడుగులు కట్టిన మురుగునీరు

నెలలు గడుస్తున్నా పారిశుధ్య పనులు కరువు

కామారెడ్డి టౌన్, మే 18: మున్సిపల్ అధికారుల పని తనానికి ఆయా వార్డుల్లో మురుగునీటి నిల్వలే నిదర్శనమని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నెలల తరబడి మురుగునీరు రోడ్లపై పారుతున్నా కల్వర్టుల కింద పెద్ద మొత్తంలో చెత్త పేరుకపోయి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతున్నా అటువైపు కన్నెత్తి చూసిన నాథుడే లేడని ప్రజలు పేర్కొంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలో గత కొన్ని నెలల నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతున్నా పారిశుధ్య పనులు మాత్రం కరువయ్యాయి. రోజు ఈ దారిగుండా పదుల సంఖ్యలో మున్సిపల్ సిబ్బంది, అధికారులు వెళ్తున్నా చూసీ చూడనట్లు వెళ్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం మాత్రమే మా గడపలు తొక్కుతున్నారే తప్ప మురుగునీటితో అవస్థలు పడుతున్నామని, దోమలు పెరిగిపోయి వ్యాధుల భారిన పడుతున్నామని ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. మురుగునీరు మడుగులు కడుతున్న ప్రాంతం కూతవేటు దూరంలోనే మున్సిపల్ కార్యాలయం ఉండడం, ఆ మురుగు నీటి లోంచే అధికారులు ప్రయాణిస్తూ పనులు మాత్రం చెప్పటం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగునీటి కష్టాలను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

పిడుగులు పడుతున్నాయ్ జాగ్రత్త

- ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి
- చెట్లు, టవర్ల కింద ఉండొద్దు

భిక్కనూరు,మే 18: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలు గత కొంత కాలంగా కురుస్తున్నాయి. ఈ సమయంలో పిడుగులు పడటం సాధారణంగా చూస్తునే ఉంటాం. ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో వర్షం పడే సమయంలో మెరుపులు, పెద పెద్ద శబ్దాలతో ఈ పిడుగులు పడుతాయి. మేఘాలు ఢీకొన్న సమయంలో వెలువడే కాంతిని మెరుపు అని, శబ్దాన్ని ఉరుము అని, ఉత్పన్నమైన విద్యుత్‌ను పిడుగు అని పిలు స్తారు.ఈపిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్‌శక్తి ఉంటుంది. అందు కే వర్షం పడినప్పుడు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు ఉంటే బయటకు రాకపోవడమే ఉత్తమం. ఇలాంటి సమ యాల్లో అజాగ్రత్తగా ఉన్నారో అంతే సంగ తులు ప్రాణనష్టం వాటిల్లడం ఖాయం. ఇప్ప టి వరకు ఉమ్మడి జిల్లాలో ఈ పిడుగుపా టుతో గత కొంత కాలంగా ఇంటికి పెద్దదిక్కు, చేతికొచ్చిన కొడుకులను కోల్పోయిన వారెందరో ఉన్నారు. చెట్లు కాలిపోయిన సంఘటనలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే పిడుగుల బా రిన పడకుండా ఉండవచ్చు. ఎక్కువగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి.

● పిడుగులు ఎలా పుడుతాయి

ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు నీరు ఆవిరిగా మారి ఆకాశంలో దాదాపు 25వేల అడుగుల ఎత్తు వరకు మేఘాలు ఏర్పడుతాయి. అయితే పై నుంచి సూర్యరశ్మి అధికంగా తాకడం వల్ల తక్కువ బరువు ఉన్న ధనావేశిత మేఘాలు పైకి వెళ్తాయి. ఇవి పైకి వెళ్లిన సమయంలో అధిక బరువుండే, దట్టమైన రుణావేశిత మేఘాలు(వీటిలో ఎలా క్ట్రాన్లు అధికంగా ఉంటాయి) కిందికి వస్తా యి. సైన్స్ ప్రకారం రుణావేశిత మేఘాల్లోని ఎలక్ట్రాన్లు సమీపంలోని ధనావేశిత మేఘాల వైపు ఆకర్షితమవుతు ంటాయి. ధనావేశిత మేఘాలు చాలా ఎత్తుకు వెళ్లిన సమయంలో దగ్గరలో మరే వస్తువు ఉన్నా అటువైపు ఎలక్ట్రాన్లు దూసుకొస్తాయి. ఆ క్రమంలోనే మేఘాల నుంచి ఎలక్ట్రాన్లు ఒక్కసారిగా విడుదలై విద్యుత్ క్షేత్రంగా మారి భూమి మీదకు దూసుకొస్తాయి. దీనినే పిడుగు అని అంటాం. ఈ సమయంలో వచ్చే మెరుపులను చూసేం దుకు ఎవరు ప్రయత్నించొద్దు. ఎందుకంటే పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుంది.



దోమకొండలో చెట్టుపై పిడుగు పడిన దృశ్యం(ఫైల్)

ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి

ఉరుములు, మెరుపులతో వర్షం పడుతున్నప్పుడు బయటకు రాకుండా ఇంట్లోనే ఉండటం ఉత్తమం. చెరువులు, కాలువలకు, టవర్లకు, చెట్లకు దూరంగా ఉండాలి. ఉరుములు వస్తుంటే వెంటనే అప్రమత్తం కావాలి, ముఖ్యంగా రైతులు, కార్మికులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఎటు వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవాలి. వీలైతే రబ్బరు చెప్పులు ధరించాలి. లేనియెడల కాళ్లను భూమికి పూర్తిగా ఆనించవద్దు. పిడుగుల పడిన సమయంలో విద్యుత్ పరికరాలకు ఎక్కువగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. కాబట్టి ఇంట్లోని విద్యుత్ పరికరాలను వినియోగించకపోవడం ఉత్తమం. మెరుపులు వస్తున్న సమయంలో ఆరుబయట స్నానం చేయడం, వంట పాత్రలు కడగటం లాంటివి సైతం చేయవద్దు.

మండలంలో ప్రతీ రోజు 2 వేల మంది ఉపాధి కూలీల హాజరు

- పక్కాగా పనుల కొలతలు
- ఎక్కువ శాతం వ్యవసాయదారులే



గొట్టిముక్కులలో ఉపాధిహామీ కొలతలు చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్, సహాయకులు

దోమకొండ, మే 18:దోమకొండ మండలంలోని అన్ని గ్రామాల్లో మొత్తం కూలీలు సుమారు 2 వేల మంది ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. వివిధ గ్రామాల్లో కూలీలు చేస్తున్న రైతుల పోలాలకు మట్టి తరలించడం, ఫౌంపాండ్, కాలువ పనులు చెరువుల్లో వివిధ రకాల పనులను నిర్వహిస్తున్నారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు కూలీలు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

● కూలీల్లో ఎక్కువశాతం వ్యవసాయదారులే

ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పనుల్లో హాజరౌతున్న వారు ఎక్కువ శాతం వ్యవసాయదారులే ఉన్నారు. వరి కోతలు పూర్తి చేసుకుని ధాన్యాన్ని విక్రయించిన రైతులు ప్రస్తుతం తమ పోలాల వద్ద ఎలాంటి పనులు లేకపోవడంతో ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు.

● కూలీలు చేపట్టిన పనులకు పక్కాగా కొలతలు

వివిధ రకాల పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీల ఫోటోలు, వారు చేసిన పనుల యొక్క పూర్తి వివరాలు, కొలతలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు పక్కగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా మాస్టర్‌లో హాజరుతో పాటు కూలీల ఫోటోలను ఆన్‌లైన్‌లో పొందపరుస్తున్నారు.

ప్రతీ పని కొలతలు పక్కాగా నమోదు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న కొలతలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు పక్కాగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. కూలీలు చేసిన పనులకు కొలతల ప్రకారం డబ్బులను వారి ఖాతలలో జమ చేయడం జరుగుతుంది. పని కావాలని డిమాండ్ రాసి ఇచ్చిన ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నాం గ్రామాల్లో కూలీలు చేసిన పనులను ఎప్పటికపుడు ఎంపీడీవో పరిశీలించడం జరుగుతుంది.

-ఏపీవో రజని

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సురేందర్

పిట్లం, మే 18:మండల కేంద్రంలోని జాతీయరహదారి సర్వీస్ రోడ్డులో వరి ధాన్యం కుప్పలకు ద్విచక్ర వాహనంతో ఢీకొని సురేందర్ అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.స్థానికులు తెలిపిన వివరాలు పిట్లం సర్వీస్‌రోడ్డు పక్కను వరి ధాన్యం కుప్పలు ఉండగా రాత్రి వేళలో ద్విచక్ర వాహనంపై పెద్దకొడప్‌గల్ గ్రామానికి చెందిన సురేందర్ వస్తుండగా కుప్పలను ఢీకొనడంతో బలమైన గాయాలయ్యాయి. కాగా సురేందర్ మృతి చెందడం జరిగిందని తెలిపారు. పోలీసులకు వివరాలు అడగగా ఎలాంటి ఫిర్యాదు తమకు రాలేదని, సంఘటన స్థలానికి మాత్రం పోలీసులు వెళ్లడం జరిగిందని పోలీసలు తెలిపారు.మృతునికి 3 ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారని వారి బంధువులు తెలిపారు.

జీలుగ విత్తనాల కోసం రైతుల ఆందోళన

ఎల్లారెడ్డి, మే 18: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గండి మాసాని పేట్ సహకార సంఘం వద్ద జీలుగ విత్తనాల కోసం రైతు లు ఆందోళన చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడు తూ పలుకు బడి ఉన్న వాళ్లకే జీలుగ సంచులు పరిమితికి మించి ఇస్తున్నా రని నిరసన వ్యక్తంచేశారు. స్టాక్ మేరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారి వద్ద పర్మిట్ తీసుకుని సహకార సంఘం వద్దకు వెళితే జీలుగు విత్తనాలు లేవని తెలపడంతో జీలుగు విత్తనాలు ప్రతి రైతుకుఅందించాలని డిమాండ్ చేశారు.



ఎల్లారెడ్డిలో ఆందోళన చేస్తున్న రైతులు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210





హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న అంజలి

హెచ్ఐవీపై అవగాహన

దోమకొండ, మే 18: వర్డ్ ఉమెన్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలోని పెద్ద చెరువులో ఉపాధిహామీ కూలీలు చేస్తున్న పని వద్ద హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్డ్ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ అంజలి మాట్లాడుతూ గృహహింస, కిషోర్ బాలికల పట్ల జాగ్రత్తల గురించి వివరించారు. సుఖవ్యాధులు సోకిన వ్యక్తులను దూషించకూడదని, వారిని తక్కువ చూడకూడదని 2017 హెచ్ఐవీ యాక్ట్ ప్రకారం 2 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ2 లక్షలు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కే. అంజాగౌడ్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

తాడ్వాయి, మే 18: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తహసీల్దార్ రహిముద్దీన్ తెలిపారు. మండలంలోని కన్కల్ గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని సూచించారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, కార్యదర్శి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద రెడ్డి వర్గం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డిని కలిసిన నాయకులు

తాడ్వాయి, మే 18: రాష్ట్రంలోని పేద రెడ్డి సామాజిక వర్గం కోసం ప్రత్యేకరెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ సలహాదారుడు నరేందర్‌రెడ్డిని ఆయన నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎంతో మంది రెడ్డి సామాజిక వర్గంలో పేదరికంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారికి న్యాయం జరగాలంటే రాష్ట్రంలో రెడ్డి సామాజిక వర్గం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక వర్గం కోసం ప్రత్యేక రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేదరెడ్డిలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ జనరల్ సెక్రెటరీ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్గొండ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికి వేసిన దృశ్యం

రోడ్డు కిరువైపులా ఉన్న చెట్లను నరికిన విద్యుత్ సిబ్బంది

రాజంపేట, మే 18: మండలంలోని ఆర్గొండ, బస్వన్నపల్లి గ్రామాల మధ్యలో రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కల్ని విద్యుత్ అధికారులు నరికి వేశారు. హరితహారం పేరుతో అటవి, పంచాయతీ అధికారులు మొక్కలను నాటడం విద్యుత్ అధికారులు అవి ఏపుగా పెరుగగానే నరికివేయడం చేస్తున్నారు. వైర్ల మీద పడేట్లు ఉన్న కొమ్మ లను నరికి వేయాల్సి ఉండగా మొత్తానికి చెట్లను నరికి వేయడం ఎంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చెట్లు నాటే సమయంలోనే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చెట్లను వైర్ల కింద నాటకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోకుండా ఇష్టారీతిన వ్యవహరించడంతో పంచాయతీ శాఖ నిర్వహణ ఖర్చులు, వాటి సంరక్షణకు ప్రజాధనాన్ని ఉపయోగించి వృథా చేయడం ఎంతవరకు సబబు అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా చెట్లను నరికివేయకుంటే విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌పార్మర్లు, సబ్‌స్టేషన్‌లు ట్రిప్పు అవుతున్నాయని సమాధానం ఇస్తున్నారు.